క్లుప్తంగా

వృద్ధులు, దివ్యాంగులకు నిత్యావసర కిట్ల పంపిణీ



నగరంపాలెం: ప్రతి ఒక్కరూ వృద్ధులు, దివ్యాంగులకు చేయూత అందించాలని శ్రీ హనుమాన్ ఆదర్శ సేవా సమితి అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ కోరారు. కొత్తపేట జానీ కాంప్లెక్స్ ఆవరణలోని సమితి కార్యాలయంలో ఆదివారం వృద్ధులు, దివ్యాంగులకు ఉచితంగా బియ్యం, నిత్యావసర వస్తువుల కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ దాతల సహకారంతో ప్రతి నెలా వృద్ధులకు ఉచితంగా బియ్యం, సరుకులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఓ ప్రైవేటు ఆసుపత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి వ్యాధి నిర్ధారణ పరీక్షలతో పాటు వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో కార్యదర్శి మాదాల ప్రకాష్, పాలేపల్లి వెంకటసుబ్రహ్మణ్యం, రజనీశ్వరరావు, ఎస్.వి.రమణ, మామిడి ప్రతీక్, శ్రావణ్, లహరి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శివపార్వతుల కల్యాణం



పాత గుంటూరు: బ్రాడీపేటలోని శ్రీ గౌరీ విశ్వేశ్వరాలయంలో ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకుని ఆదివారం స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అర్చకులు గౌరీ విశ్వేశ్వరశర్మ ఉత్సవమూర్తులకు ప్రత్యేక అలంకరణ చేసి విశేష పూజలు చేశారు. ఉభయదాతలుగా జంధ్యాల శివరామప్రసాద్, లక్ష్మీసుజాత, సీహెచ్. వెంకటేశ్వర్లు, సత్యశ్రీ దంపతులు వ్యవహరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్‌కుమార్‌శర్మ, మల్లికార్జునశర్మ, కల్యాణ్ పర్యవేక్షించారు.

వీనుల విందుగా సుమధుర సినీ సుస్వరాలు



పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో ఆదివారం సాయిబాబా టెలీ ఫిలిమ్స్ వ్యవస్థాపకులు డి.టి. సాయిబాబా ఆధ్వర్యంలో సుమధుర సినీ సుస్వరాలు పేరున నిర్వహించిన సంగీత విభావరి ప్రేక్షకుల్ని అలరించింది. గాయకులు సాయిబాబా, పి.ఎల్. ఆలీఖాన్, భారతి, సౌజన్య, దయామణి, రవి, సురేష్, వెంకట్ పలు చిత్రాల్లోని పాటల్ని శ్రావ్యంగా ఆలపించారు. సంగీతాన్ని అలీఖాన్ బృందం అందించింది. కార్యక్రమంలో భారతీ సాంస్కృతిక సంగీత కళావేదిక వ్యవస్థాపకుడు మిరియాల ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు. వ్యాఖ్యాతగా షేక్ నజీర్ వ్యవహరించారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



నెహ్రూనగర్: నవ్యాంధ్ర దాసు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం కృష్ణ తులసీనగర్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ వేముల కృష్ణ ప్రసాద్ శిబిరాన్ని ప్రారంభించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ నవ్యాంధ్ర దాసు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సంఘ నాయకులు డాక్టర్ చెవుల ఏడుకొండలు, పాండురంగ నాయకస్వామి, నామాల దామోదరం, నరేంద్ర, చెన్నకేశవులు పాల్గొన్నారు.

కార్మెల్‌మాతకు భక్తుల పూజలు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కార్మెల్ మాతను దర్శించుకునేందుకు పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఉదయాన్నే రైలు, వాహనాల్లో ధర్మవరం, కర్నూలు, ఆళ్లగడ్డ, మార్కాపురం, వెంకటపాలెం ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కొండను ఎక్కి తలనీలాలు సమర్పించారు. కార్మెల్ మాతను దర్శించుకొని కొబ్బరికాయలు కొట్టి, కొవ్వొత్తులు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొండదిగువన ఉన్న బాల ఏసుదేవాలయంలో దివ్యపూజాబలికార్యక్రమంలో పాల్గొన్నారు. దేవాలయ సహాయ విచారణ గురువులు భక్తులను ఆశీర్వదించారు.

ఇక పక్కాగా ఓట్ల లెక్క

- గ్రామాల్లో చురుగ్గా సాగుతున్న సర్వే
- ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్న బీఎల్‌వోలు
- రాజకీయ పార్టీలతోనూ సమావేశాలు నిర్వహించిన రిటర్నింగ్ అధికారి
- నూతన ఓట్లకూ దరఖాస్తుల స్వీకరణ
- ఈ నెల 21తో ముగియనున్న సర్వే



ప్రత్తిపాడు మండలం కోయవారిపాలెంలో బీఎల్‌వోలు చేస్తున్న ఇంటింటి సర్వేను తనిఖీ చేస్తున్న నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ప్రభాకర్‌రెడ్డి (ఫైల్)

ప్రత్తిపాడు: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అత్యంత విలువైనది. ఓటు ద్వారా నేతల 'రాత'తో పాటు దేశ భవిష్యత్తును కూడా నిర్ణయించవచ్చు. పద్దెనిమిది సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ పొందవచ్చు. ఇందుకోసం ప్రతి సంవత్సరం ఎన్నికల సంఘం ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ–2024 పేరుతో నెల రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. జులై 21 నుంచి ప్రారంభమైన ఈ సర్వే ఆగస్టు 21 వరకూ కొనసాగనుంది. బూత్ స్థాయి అధికారులు నేరుగా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల సర్వే చేస్తూ, పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. ఈ సర్వే నియోజకవర్గంలో చురుగ్గా సాగుతుంది. ప్రత్తిపాడు నియోజకవర్గంలో 285 పోలింగ్ కేంద్రాల్లో 2,54,472 మంది ఓటర్లు ఉన్నారు.

సర్వేలో ఏం చేస్తారంటే...

- అర్హత ఉండీ 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండే వారిని ఓటర్ల జాబితాలో చేర్పిస్తారు.
- ప్రధానంగా తప్పుల సవరణ, నూతన ఓట్లు నమోదు, మృతులు, నకిలీ ఓట్ల తొలగింపు చేపట్టనున్నారు.
- ఓటర్ల జాబితాలో ఒకటి కన్నా ఎక్కువ సార్లు పేరు నమోదైనా, చనిపోయిన వారు ఉన్నా, శాశ్వతంగా గ్రామం విడిచి వెళ్లిన వారు ఉంటే అలాంటి ఓట్లు తొలగిస్తారు.
- ప్రస్తుతమున్న జాబితాలో ఫొటో సరిగా కనిపించకున్నా మార్చుకునేందుకు అవకాశం ఉంది.
- వయస్సులో వ్యత్యాసాలున్నా, ఓటరు ఇంటి అడ్రస్, వ్యక్తిగత వివరాల్లో మార్పులు, చేర్పులకు వెసులుబాటు కల్పించారు.
- ఒకే ఇంట్లో ఎక్కువ ఓట్లు ఉంటే వాటిని గుర్తించి, ఒకటికి రెండు సార్లు పరిశీలించి తొగించేందుకు చర్యలు
- ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి ఇప్పటికే బీఎల్‌వోలకు శిక్షణ ఇచ్చారు. వీఎల్‌వో ఓటరు యాప్ వెర్షన్ 4.7 ద్వారా నూతన ఓటర్ల నమోదు, పాతవి తొలగించడం వంటివి యాప్ ద్వారానే చేయనున్నారు.

ఇప్పటి వరకూ సర్వే ఇలా..

నియోజకవర్గంలో మొత్తం 285 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. ఐదు మండలాల్లో 90,467 నివాసాలు ఉండగా, 2,54,472 మంది ఓటర్లున్నారు. ఇప్పటి వరకు బీఎల్‌వోలు 66,907 ఇళ్లకు వెళ్లి, 1,61,621 మంది ఓటర్ల వివరాలు పరిశీలించారు. అంటే 12వ తేదీ వరకు 73.96 శాతానికి పైగా సర్వే పూర్తయ్యింది. 1170 మంది నూతన ఓటుకు ఫారం–6 అందించగా, ప్రొస్పెక్టివ్ ఓటర్లుకు సంబంధించి 142, ఒకే కుటుంబంలో ఎక్కువ ఓట్లు ఉన్నటువంటివి 21, నియోజకవర్గంలో శాశ్వతంగా ఉండని ఓటర్లు 195, మరణించిన వారికి సంబంధించి 459, మార్పులు చేర్పులకు సంబంధించి 2,267 దరఖాస్తులు ఇప్పటి వరకు బీఎల్‌వోలకు అందాయి.

రాజకీయ పార్టీలతోనూ సమావేశాలు

పారదర్శకంగా ఓటర్ల జబితా రూపొందించేందుకు జిల్లా యంత్రాంగం పకడ్బందీగా వ్యవహరిస్తోంది. గ్రామాల్లో ఇంటింటి సర్వేను నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, గుంటూరు ఆర్డీవో ప్రభాకర్‌రెడ్డి ఆకస్మిక తనిఖీ చేస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి ఆయనే స్వయంగా ఓటర్ల వివరాలను పరిశీలిస్తున్నారు. అటు రాజకీయ పార్టీలతోనూ సమావేశాల్ని నిర్వహించారు. జులై 20, 26తో పాటు ఈ నెల 9న నియోజకవర్గస్థాయిలో ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నేతలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ఎస్ఎస్ఆర్–2024పై చర్చించారు.

ప్రస్తుతం నియోజకవర్గంలో ఓటర్ల వివరాలు..

మండలం	పురుషులు	మహిళలు
ప్రత్తిపాడు	18,867	20,047
వట్టిచెరుకూరు	17,999	19,168
పెదనందిపాడు	16,415	17,827
కాకుమాను	15,977	17,290
గుంటూరురూరల్	53,555	57,193
మొత్తం	1,12,813	1,31,520

పారదర్శకంగా ఇంటింటి సర్వే

ఈ నెల 21 నాటికి వంద శాతం పూర్తి చేసే లక్ష్యంతో సర్వే జరుగుతోంది. సర్వేపై ప్రత్యేక సమీక్షలూ నిర్వహిస్తున్నాం. ఇప్పటికే రాజకీయ పార్టీలతోనూ వారానికోసారి సమావేశాలు నిర్వహించి వారి సలహాలు, సూచనలు తీసుకుంటున్నాం. వచ్చిన అభ్యంతరాలనూ వారికి అందజేస్తున్నాం. వలంటీర్ల ప్రమేయమనేది లేకుండా కేవలం బీఎల్‌వోలతోనే సర్వే జరుగుతోంది. ఓట్ల తొలగింపుపై సంబంధిత ఓటర్లకు నోటీసులిచ్చిన తరువాతనే తదుపరి చర్యలు తీసుకోవాలని బీఎల్‌వోలకు స్పష్టమైన ఆదేశాలిచ్చాం. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటునూ అకారణంగా తొలగించం. 2024 జనవరి ఒకటవ తేదీ నాటికి ఓటరుగా అర్హత ఉన్న వారికి ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. సర్వే అత్యంత పారదర్శకంగా, పక్కాగా జరుగుతోంది.

–ఎం. ప్రభాకర్‌రెడ్డి (నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో, గుంటూరు)

బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ సేవలు అభినందనీయం

ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య



రక్తదాతకు ప్రశంసాపత్రాన్ని అందజేసి, సన్మానిస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య తదితరులు

చేబ్రోలు: పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య కొనియాడారు. అసోసియేషన్ 7వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం కిరాణా మర్చంట్ అసోసియేషన్ కల్యాణ మండపంలో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు రక్తదాత, ప్రాణదాతలకు అవార్డుల్ని ప్రదానం చేశారు. వ్యవస్థాపక అధ్యక్షుడు తిరుమలశెట్టి ఉమాశంకర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రమాద బాధితులకు, ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు రక్తదానం చేసి ప్రాణదాతలుగా మారాలని సూచించారు. అనంతరం పలువురు రక్తదాతలకు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున ప్రశంసా పత్రాలు, జ్ఞాపికల్ని అందజేశారు. సమావేశంలో స్టేట్ మైనార్టీ కమిషన్ సభ్యుడు షేక్ సైపుల్లా, బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ముమ్మరంగా జీబీసీ రహదారి విస్తరణ పనులు



చేబ్రోలు: పొన్నూరు పట్టణంలో జీబీసీ రహదారి విస్తరణ పనులు మూడు రోజులుగా ముమ్మరంగా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ఆదివారం పనుల్ని అధికారులు, పార్టీ నాయకులతో కలసి పరిశీలించారు. ప్రస్తుతం సాక్షి భావన్నారాయణస్వామి దేవస్థానం వద్ద నుంచి కొప్పాక వెంకయ్య మున్సిపల్ కూరగాయ మార్కెట్టు వరకు తొలి విడత విస్తరణ పనులు జరుగుతున్నాయి. తెనాలి డీఎస్పీ బి. జనార్దనరావు, సీఐ మహమ్మద్ ఖాజా అల్తాఫ్‌తో పాటు మున్సిపల్, ఆర్ అండ్ బీ, రెవెన్యూ అధికారులకు ఎమ్మెల్యే కిలారి పలు సూచనలు చేశారు.

ప్రజా గాయకుడు గద్దర్‌కు నివాళి



లాడ్జి సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద గద్దర్ చిత్రపటానికి నివాళి

నెహ్రూనగర్: నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి అణగారిన ప్రజల భూమి కోసం, భుక్తి కోసం పాటనే ఆయుధంగా చేసుకుని లక్షలాది మందిని చైతన్యవంతుల్ని చేసిన ప్రజా గొంతుక, యుద్ధ నౌక గద్దర్ అని భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ల ప్రకాష్ పేర్కొన్నారు. గద్దర్ సంస్మరణను సభను ఆదివారం లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం దగ్గర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూస్వామ్య, పెట్టుబడి వ్యవస్థలకు తరతరాలుగా బానిసలుగా బతుకునీడుస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజల్ని సంఘటిత పరిచేందుకు పుట్టిన ఊరుని, తల్లిదండ్రుల్ని గద్దర్ వదలి దీర్ఘకాలికంగా ఉద్యమంలోనే కొనసాగారని కొనియాడారు. ఆయన ఆశయాల్ని నేటి యువత కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు వై. కోటేశ్వరరావు(వైకె), నరసింహారావు, డేవిడ్ విలియమ్స్, జూపూడి శ్రీనివాసరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మృతదేహాలను స్వస్థలాలకు తరలించాల్సిందే !

సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్



మహాప్రస్థానం డ్రైవర్‌తో మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ చనిపోయిన వ్యక్తి మృతదేహాన్ని స్వస్థలానికి తరలించకుండా రూల్స్ పేరుతో మహాప్రస్థానం వాహనం నిర్వాహకులు మిన్నకుండిపోవడంపై సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తన సొంత వాహనంలో చనిపోయిన వారిని తరలించేందుకు ఏర్పాట్లు చేస్తుండగా, నిర్వాహకులు దిగి వచ్చారు. ఆదివారం గుంటూరు జీజీహెచ్‌లో జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లా టోకపల్లికి చెందిన ఓ రోగి గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. మృతదేహాల్ని ఉచితంగా తరలించేందుకు ప్రభుత్వం మహాప్రస్థానం వాహనాల వారితో ఒప్పందం చేసుకుంది. అయితే, వారు ఏలూరు వరకు మాత్రమే మృతదేహాన్ని తీసుకెళ్తామని, అక్కడి నుంచి ప్రైవేటు వాహనంలో తీసుకెళ్లాలని చెప్పారు. దీనిపై వాహనాల జోనల్ మేనేజర్‌తో ఆస్పత్రి సూపరింటెండెంట్ ఫోన్‌లో మాట్లాడారు. సొంత ఊరికి తరలించాలని చెప్పినా వారు నిబంధనల పేరుతో నిరాకరించారు. జీజీహెచ్‌కు రాష్ట్రవ్యాప్తంగా అనేక జిల్లాల నుంచి చికిత్స కోసం వస్తున్నారని, ఒకవేళ వారు చనిపోతే తప్పనిసరిగా వారి స్వగ్రామానికి మృతదేహాన్ని తరలించాల్సిందేనని డాక్టర్ కిరణ్‌కుమార్ చెప్పారు. జోనల్ మేనేజర్‌కి చెప్పినా చలనం లేకపోయేసరికి సూపరింటెండెంట్ తన సొంత కారులోనే మృతదేహాన్ని తరలించేలా ఏర్పాట్లు చేశారు. విషయం తెలుసుకున్న మహాప్రస్థానం నిర్వాహకులు వ్యాన్‌లోనే మృతదేహాన్ని తరలించారు.

పేదల పక్షాన ఎన్నికల బరిలోకి సీఎం జగన్

ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, ఎమ్మెల్యే గిరి తదితరులు

పట్నంబజారు: రానున్న ఎన్నికల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షాన బరిలోకి దిగుతున్నారని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని 36వ డివిజన్ సాయినగర్ నుంచి రాజీవ్‌గాంధీ నగర్ వరకు నిర్మించ తలపెట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులకు నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, స్థానిక కార్పొరేటర్ ఉడుముల లక్ష్మి, శ్రీనివాసరెడ్డితో కలసి ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ పెత్తందారుల పక్షాన మూకుమ్మడిగా అన్ని రాజకీయ పార్టీలు పోటీకి వస్తుంటే.. పేదల పక్షాన సీఎం జగన్ వస్తున్నారని తెలిపారు. తమ పాలనలో మంచి జరిగిందని భావిస్తేనే ఓటేయండని అత్యంత సాహసోపేతంగా ప్రజలకు పిలుపిచ్చిన ఏకైక సీఎం వై.ఎస్. జగన్ అని కొనియాడారు. స్వాతంత్ర్యం అనంతరం ఎన్నో పార్టీలు, ఎందరో ముఖ్యమంత్రులు రాష్ట్రాన్ని పరిపాలించారని, మహానేత డాక్టర్ వైఎస్సార్, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌లా సుపరిపాలన అందించిన దాఖలాలు లేవని తెలిపారు. వలంటీర్లపై కొందరు పనిగట్టుకుని చేస్తున్న విషప్రచారాన్ని, దండుపాళెం బ్యాచ్ అంటూ చేస్తున్న వ్యాఖ్యానాల్ని ఆయన తీవ్రంగా ఖండించారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం పాటు పడుతున్న సీఎం జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మద్దాళి గిరి మాట్లాడుతూ దేశంలోనే అభివృద్ధి చెందిన రాష్ట్రాల విషయంలో ఏపీ ప్రథమ స్థానంలో నిలిస్తే... రాష్ట్రంలోని 13 కార్పొరేషన్లలో గుంటూరు నగరపాలక సంస్థ మొట్టమొదటి స్థానంలో నిలిచినట్లు చెప్పారు. గుంటూరులో కూడా ప్రత్యేకించి తన పశ్చిమ నియోజకవర్గంలో ఇప్పటికే రూ.115 కోట్ల మేర ప్రగతి పనులు పూర్తయినట్లు తెలిపారు. మరో రూ. 70 కోట్ల మేరకు అభివృద్ధి పనులు మంజూరై పలు దశల్లో ఉన్నట్లు వివరించారు. గతంలో ప్రజలకు ప్రత్యక్ష నరకాన్ని చూపించిన గుంటూరు రోడ్లన్నీ ఇప్పుడు సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్నాయని చెప్పారు. 2019లో వైఎస్సార్ సీపీ అధికారంలో వచ్చి, సీఎంగా జగన్ అయిన తరువాతనే ఇంత అభివృద్ధి సాధ్యమైందని వివరించారు. కార్యక్రమంలో గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, కార్పొరేటర్ చల్లా రాజ్యలక్ష్మి, మాజీ కార్పొరేటర్ ఉడుముల అప్పిరెడ్డి, పార్టీ నేతలు దుగ్గెంపూడి వెంకటేశ్వరరెడ్డి, చల్లా శేషిరెడ్డి పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న విష్ణువర్ధన్, కృష్ణవేణి, పద్మజ

గుంటూరు ఎడ్యుకేషన్: దేశం స్వాతంత్ర్యం కోసం ప్రాణాల్ని సైతం లెక్కచేయకుండా పోరాటం చేసిన సమరయోధుల్ని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జనవిజ్ఞానవేదిక, స్టూడెంట్ యూనియన్ ఫర్ నేషన్ (సన్) సంయుక్తంగా ఆదివారం లక్ష్మీపురం మెయిన్ రోడ్డులోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ స్కూల్లో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన, క్విజ్ పోటీల్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వం అనే సిద్ధాంతంతో మనుగడ సాగిస్తున్న భారతదేశంలో అదే స్ఫూర్తిని కొనసాగించేందుకు విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తిని రగిలించి, స్వాతంత్ర్య దినోత్సవ స్ఫూర్తిని ప్రేరేపించేందుకు జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో పోటీల్ని నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఈసందర్భంగా వివిధ పాఠశాలల నుంచి 500 మందికి పైగా విద్యార్థులు ఆయా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతిభ చూపిన వారికి ప్రశంసాపత్రం, జ్ఞాపిక బహూకరించారు. కార్యక్రమంలో జనవిజ్ఞానవేదిక జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఏ. సత్యనారాయణప్రసాద్, ప్రధాన కార్యదర్శి బి. ప్రసాద్, టి. జాన్‌బాబు, బి. శంకర్‌సింగ్, కె. సాయికుమార్, హరీష్, దేవసూర్య, ఎం, చిన్నమ్మ, ఉదయ్‌భాస్కర్, జి. వెంకట్రావు, పాఠశాల డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జె. పద్మజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు నగరపాలక సంస్థలో 'స్పందన'

నెహ్రూనగర్: స్థానిక సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నగరపాలక సంస్థ కౌన్సిల్ హాలు నిర్వహించనున్నట్లు అదనపు కమిషనర్ పెద్ది రోజా ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సచివాలయాల్లోనూ ప్రతి రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 వరకు స్పందన జరుగుతుందన్నారు. అక్కడ పరిష్కారం కాని సమస్యలపై నేరుగా తమకు అర్జీలు అందజేయవచ్చని సూచించారు.

అలరించిన భక్తి సంగీత విభావరి



పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలోని అన్నమయ్య కళావేదికపై ఆదివారం విజయవాడ అభిషేక్ మెలోడీస్ ఆధ్వర్యంలో భక్తి సినీ పాటల సంగీత విభావరి నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గాయకులు సర్వ విఘ్న హరం దేవంతో ప్రారంభించారు. భగవద్గీత శ్లోకాలు, పలు అన్నమాచార్య కీర్తనలు, భక్తి, సినీ పాటల్ని ఆలపించి ఆహూతుల్ని ఆకట్టుకున్నారు. కార్యక్రమాన్ని నిర్వహకులు అభిషేక్ పర్యవేక్షించారు.

మణిపూర్‌లో శాంతిని కోరుతూ ర్యాలీ



జార్జిపేట మెయిన్ రోడ్డులో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవ సంఘ నాయకులు, విశ్వాసులు

నెహ్రూనగర్: మణిపూర్ రాష్ట్రంలో అల్లర్లు అరికట్టి శాంతిని నెలకొల్పి, క్రైస్తవులకు న్యాయం చేయాలని కోరుతూ ఆదివారం క్రైస్తవ సంఘాల నాయకులు పలు చర్చిల పాస్టర్లు, విశ్వాసులతో కలసి గుజ్జనగుండ్ల సెంటర్ నుంచి పట్టాభిపురం జార్జిపేట చర్చి వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆల్ ఇండియా క్రిస్టియన్ యూత్ అసోసియేషన్(ఐక్య) వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గోళ్లమూడి రాజసుందర బాబు మాట్లాడుతూ మణిపూర్‌లో రాజ్యాంగం, ప్రజాస్వామ్యం విఫలం కావడంతో వేలాదిమంది క్రైస్తవులు నివాసాలు కోల్పోయారని తెలిపారు. మణిపూర్ ఘటనపై నిఘా వర్గాల సమాచారం ఉన్నా ప్రధాని మోదీ విదేశీ పర్యటనలకు వెళ్లడం బాధ్యతారహిత్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో రెండు గంటలు మాట్లాడిన మోదీ మణిపూర్ ఘటనపై కేవలం రెండు నిమిషాలు మాత్రమే మాట్లాడటం సిగ్గుచేటని ఖండించారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి కలగజేసుకోకపోతే మణిపూర్ వాసులకు న్యాయం, సహాయం దక్కేవి కాదని తెలిపారు. అనంతరం మణిపూర్ క్రైస్తవులకు న్యాయం చేయాలని కోరుతూ పట్టాభిపురం జార్జిపేట వద్ద మోకాళ్లపై నిలబడి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు సురేష్‌జేమ్స్, లూర్దురాజు, సమర్పణరావు, సువర్ణరాజు, రాజేష్, డొక్కా జార్జి, సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో నిందితుల అరెస్టు ?

మంగళగిరి: ఇటీవల నగరంలోని పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడిన పలువురు నిందితులను మంగళగిరి రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ జరిపిన పోలీసులు 11 దొంగతనాలకు సంబంధించి వివరాలు సేకరించి చోరీ చేసిన సొమ్మును రికవరీ చేసినట్లు తెలిసింది. ఇవే కాకుండా నిందితులు మరెక్కడ చోరీలకు పాల్పడ్డారనే విషయమై పోలీసులు విచారణ చేస్తున్నారు.

చిన్నారుల్లో ప్రతిభను వెలికితీసేందుకు కృషి



పోటీలకు హాజరైన చిన్నారులు, తల్లిదండ్రులు

తాడేపల్లిరూరల్: చిన్నారుల్లో సృజనాత్మకశక్తిని వెలికితీసేందుకే చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి సీవీఆర్ కల్యాణ మండం వద్ద ఉన్న ఐకాన్ అపార్ట్‌మెంట్‌లో మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షులు పరుచూరి కిరణ్ మాట్లాడుతూ మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో జరుగుతున్న వివిధ రకాల పోటీలు ఐక్యత, ఆనందం కోసమేనని అన్నారు. భవిష్యత్తులో నిర్వహించబోయే కార్యక్రమాలకు తమ సహాయ, సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర బాలోత్సవాల కన్వీనర్ పిన్నమనేని మురళీకృష్ణ, ఎంటీఎంసీ బాలోత్సం అధ్యక్షులు వీవీ ప్రసాద్ మాట్లాడుతూ సెల్‌ఫోన్లు వచ్చి పిల్లల్లో ఆలోచనా శక్తిని తగ్గించిందని, తల్లిదండ్రులు కూడా పిల్లలకు ఇచ్చి వారి పనుల్లో నిమగ్నమవుతున్నారని, ఈ పరిస్థితి మారాలని కోరారు. అనంతరం చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. బాలోత్సవం ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో ఆంధ్ర నాటక కళాసమితి అధ్యక్షులు నన్నపనేని నాగేశ్వరరావు, విశ్వ మానవ సంక్షేమ సంఘం అధ్యక్షులు పి.మస్తాన్‌రావు, వీఆర్ రెసిడెన్సీ అధ్యక్షులు ఎస్.చంద్రశేఖర్, అమరావతి బాలోత్సం కార్యదర్శి ఆర్.కొండలరావు, ఎంటీఎంసీ బాలోత్సం కార్యదర్శి శ్రీలక్ష్మి, విక్రం, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు శ్రీ టీవీ పురస్కారాల ప్రదానం



పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలోని అన్నమయ్య కళావేదికపై మంగళవారం కళాంజలి క్రియేషన్స్ నిర్వహణలో 2023 శ్రీ టీవీ జాతీయ కళాశ్రీ పురస్కారాల్ని ప్రదానం చేయనున్నట్లు సంస్థ అధ్యక్షుడు ప్రముఖ రంగస్థల, సినీ నటుడు చిట్టినేని లక్ష్మీనారాయణ తెలిపారు. ఆలయంలో ఆదివారం కార్యక్రమాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డారు. కళాకారులు మిరియాల సత్తెమ్మ, పొత్తూరి రంగారావు, డాక్టర్ రామచంద్ర, డాక్టర్ జె. రవికుమార్, అనూషా యాదవ్, డాక్టర్ సునామి సుధాకర్, కళావిపంచి బొప్పన నరసింహారావు, నిమ్మగడ్డ మీరయ్య, సుఖమంచి కోటేశ్వరరావు, షేక్ గనిలకు శ్రీ పురస్కారాల్ని అందించి, సన్మానిస్తున్నట్లు తెలిపారు. కళాభిమానులు, కళాకారులు పాల్గొనాలని ఆయన కోరారు.